క్లుప్తంగా

252 మందికి వైద్య పరీక్షలు



పరీక్షలు చేస్తున్న వైద్యులు

అరకులోయ రూరల్: మండలంలోని లోతేరు పంచాయతీ కేంద్రంలోని నిధనీ ట్రస్ట్, రక్షణ శాఖ ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి స్థానికులతో పాటు పరిసర గ్రామాల నుంచి సుమారు 252 మంది వచ్చారని, వారికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేసినట్టు నిధనీ ట్రస్టు చైర్మన్ డాక్టర్ మధుబాల చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన్యంలో ప్రతి గ్రామాల్లో ఆదివాసీలకు సంస్థ తరఫున పూర్తి స్థాయిలో సేవలందించేందుకు శ్రీకారం చుట్టామన్నారు.మారుమూల గ్రామాల్లోనూ వైద్య శిబిరాలు, సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. గిరిజనులకు సేవ చేయడమే లక్ష్యంగా హైదరాబాద్ నుంచిఉమ్మడి విశాఖ మన్యంలో అడుగు పెట్టామన్నారు, ట్రస్ట్ సేవలు ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఇక్కపై మరింత గ్రామాల్లో శిబిరాలు నిర్వహించి వైద్యం అందిస్తామన్నారు. సర్పంచ్ కళావతి, నాయకులు రాంచందర్, శ్రీరాం, శెట్టి సోమేష్ పాల్గొన్నారు. డాక్టర్ కృష్ణమోహన్, డాక్టర్ వీర్రాజు, డాక్టర్ ప్రియాంక తదితరులు వైద్య సేవలందించారు.

ఎస్ఐకు అభినందనలు



ఎస్ఐ పాపినాయుడుకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందిస్తున్న వైస్ ఎంపీపీ, వైస్ సర్పంచ్

డుంబ్రిగుడ: మండలానికి బదిలీపై వచ్చిన ఎస్ఐ పాపినాయుడును శనివారం వైస్ ఎంపీపీ శెట్టి ఆనంద్‌రావు, పోతంగి పంచాయతీ వైస్ సర్పంచ్ జగ్గనాయుడు తదతరులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. అనంతరం వైస్ ఎంపీపీ మాట్లాడుతూ డుంబ్రిగుడ మండల పరిధిలో గంజాయి రవాణా అరికట్టి శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు నాయుడు పాల్గొన్నారు.

వరద బాధితులకు భోజనం



కోతులగుట్టలో బాధితులకు భోజనం అందిస్తున్న దాతలు

కూనవరం: ఇటీవల వచ్చిన గోదావరి వరదలకు గత నాలుగు రోజులుగా కోతులగుట్టలో ఏపీఆర్ గురుకులం పాఠశాల పునరావాస కేంద్రంలో ఉంటున్న వరద బాధితులకు కూనవరం గ్రామానికి చెందిన కొమ్మని పవన్ కృష్ణ సాయి హైదరాబాద్‌లో ఉద్యోగం చేసుకుంటూ తన స్వగ్రామంలోని వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకు వచ్చారు తన తల్లిదండ్రులు కె.వీర్రాజు, సునీతల ద్వారా వరద బాధితులకు శనివారం భోజనం సౌకర్యం కల్పించారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్, గ్రామస్తులు

డుంబ్రిగుడ: మండలంలోని గుంటసీమ పంచాయతీ గుంటసీమ నుంచి తడ్డా గ్రామానికి మట్టి రోడ్డు పనులను సర్పంచ్ గుమ్మ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రేమానందం, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఏచూరి సేవలు మరువలేనివి

వై.రామవరం: మండల కేంద్రంలోని సీఐటీయూ మండల కార్యదర్శి కంభం శాంతిరాజు ఆధ్వర్యంలో ఏచూరి సీతారాం మృతికి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. శాంతిరాజు మాట్లాడుతూ ఏచూరి సీతారాం మరణం సీఐటీయూతో పాటు దేశానికే తీరని లోటు అన్నారు. రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు నాయకత్వం వహించి ఎన్నో పోరాటాలు చేసిన ఘనత ఆయనదని, ఆయన సేవలు మరువలేనివన్నారు. నాయకులు మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి నిదర్శనం

- శిథిలావస్థలో జీసీసీ డిపోలు
- కారిపోతున్న భవనాలు
- తడిసిపోతున్న సరకులు.. సిబ్బంది అవస్థలు
- భవన సమస్యలు తీర్చాలని గ్రామస్తుల డిమాండ్



జోలాపుట్టు జీసీసీ డిపో భవనం దుస్థితి



శిథిలావస్థలో ఉన్న బంగారుమెట్ట జీసీసీ డీఆర్ డిపో

ముంచంగిపుట్టు: నిత్యావసర సరకులు నిల్వచేసే జీసీసీ డీఆర్ డిపోలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి...దశాబ్దాల క్రితం నిర్మించిన భవనాలు..కనీస మరమ్మతుకు నోచుకోకపోవడంతో అధ్వానంగా మారాయి.బీటలు వారిన గోడలు.. ఊడిపోతున్న తలుపులు, కిటికీలు.. పెచ్చులూడుతున్న శ్లాబ్‌లతో దర్శనమిస్తున్నాయి. వర్షం పడితే పూర్తిగా కారిపోతున్నాయి. గదులన్నీ వర్షపునీటితో నిండుతున్నాయి.. దీంతో సరకులు నిల్వచేసేందుకు సేల్స్ మెన్లు పడరాని పాట్లు పడుతున్నారు.

ఇరుకైన అద్దె భవనాల్లో

ముంచంగిపుట్టు మండలంలో 23 పంచాయతీల్లో 376 గ్రామాల్లో ఉన్న కార్డుదారులకు రేషన్ సరకులు పంపిణీ చేసేందుకు 46 డిపోలు ఉన్నాయి. ఇందులో మండలంలోని కుమడ, వనభసింగి ప్రాంతాల్లో మాత్రమే నూతన భవనాలున్నాయి. 38 జీసీసీ డిపోలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. మండలంలోని బంగారుమెట్ట, జోలాపుట్టు, సంగడ, మాకవరం, కర్రిముఖిపుట్టు, ముంచంగిపుట్టు రేషన్ డిపోలకు భవనాలు ఉన్నా.. అవి అన్ని పూర్తిగా శిథిలావస్థలో ఉన్నాయి. అధ్వానంగా ఉన్న భవనాల ద్వారానే రేషన్‌దారులకు ప్రతి నెల సరకులు అందిస్తున్నారు. రేషన్ డిపోలు నిర్మించి 30 ఏళ్లకు పైగా అవుతుండడంతో భవనాల పైకప్పు పూర్తిగా పాడైయింది. గత కొంతకాలంగా సేల్స్ మెన్లు టార్పాలిన్లు కప్పి కారిపోకుండా నెట్టుకొని వస్తున్నారు. ప్రస్తుతం డిపోల భవనాల పైకప్పు రేకులు పూర్తిగా పాడై కారిపోతున్నాయి. దీంతో బియ్యం బస్తాలు, పంచదార, కందిపప్పు, అంగన్‌వాడీ కేంద్రాలకు మధ్యాహ్న భోజనం అందించే నిత్యావసర సరకులను తడిసిపోకుండా చూసేందుకు సేల్స్‌మెన్లు అవస్థలు పడుతున్నారు. దీంతోపాటు కిటికీలు, తలుపులు పాడై ఊడిపోయే పరిస్థితుల్లో దర్శనమిస్తున్నాయి. గోడలు బీటలు వారి ఎప్పుడు కూలిపోతాయే తెలియని పరిస్థితి నెలకొంది. ఓవైపు సరకులను, మరోవైపు రికార్డులను భద్రపరిచే పనుల్లో నిమగ్నమై బిక్కుబిక్కుమంటూ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. భవన సమస్యపై ఉన్నతస్థాయి అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లినా సమస్య పరిష్కారం కావడం లేదని రేషన్‌దారులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, జీసీసీ ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

కొత్త భవనం అవసరం

జీసీసీ డిపో భవనం చూస్తేనే భయమేస్తుంది. ఎన్నో సంవత్సరాల క్రితం నిర్మించిన భవనం కావడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది.సేల్స్‌మెన్ రేషన్ సరకులు నిల్వ చేసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు.వర్షాకాలంలో సరకులు పాడై పంపిణీ సమయంలో సేల్స్‌మెన్‌తో పాటు రేషన్‌దారులు అవస్థలు పడుతున్నారు. జీసీసీ డిపోకు నూతన భవనం మంజూరు చేయాలి.

– కొండమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు, బంగారుమెట్ట పంచాయతీ, ముంచంగిపుట్టు మండలం

ప్రతిపాదనలు పంపాం

మండలంలో శిథిలావస్థలో ఉన్న జీసీసీ డిఆర్ డిపోలను పరిశీలించాం. నూతన భవనాలకై ప్రతిపాదనలు పంపించడం జరిగింది.నిధులు మంజూరు కోసం వేచి చూస్తున్నాం. సరకుల నిల్వపై సేల్స్‌మెన్లుకు పలు సూచనలు చేయడం జరిగింది.

– డి.సింహాచలం, జీసీసీ డీఎం, పాడేరు

వరద బాధితులకు ఆపన్నహస్తం



చట్రాపల్లిలో బాధితులకు నిత్యవసరాలు అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు



శబరి కొత్తగూడెం వరద బాధితులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు



చినార్కూరులో నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రంగమ్మ, సర్పంచ్ అభిరామ్‌లు



సీలేరులో సరకులు అందజేస్తున్న ఎస్ఐ రామకృష్ణ

గూడెంకొత్తవీధి: మండల విద్యాశాఖ అధికారుల ఆధ్వర్యంలో అన్ని విభాగాలకు చెందిన ఉపాధ్యాయ సంఘాల నాయకులంతా కలసి అధిక మొత్తంలో నిత్యావసరాలు, దుస్తులు, వంటపాత్రలు తదితర సామగ్రిని చట్రాపల్లి వరద బాధితులకు శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సత్యనారాయణ, రామన్న, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కామేశ్వరరావు, రాజారావు, రామరాజు, పెద్దబ్బాయి, వీరయ్యదొర, వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు. చట్రాపల్లి గ్రామాన్ని మాజీ మంత్రి మత్యరాస మణికుమారి , రాష్ట్ర కార్యదర్శులు రమేష్ నాయుడు, సుబ్బారావు, రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు చిట్టిబాబులు పర్యటించి, బాధితులకు నిత్యావసరాలు, దుస్తులు పంపిణీ చేశారు. కొయ్యూరు మండల పార్టీ అధ్యక్షుడు సత్యనారాయణ, బలరాం, మహేష్, కల్యాణి తదితరులున్నారు.

దుప్పట్ల పంపిణీ

కూనవరం: శబరి కొత్తగూడెంలో వరద బాధితులకు యూటీఎఫ్ మండల కమిటీ శనివారం దుప్పట్లు చేసింది. ఈ సందర్భంగా యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వరరావు, కన్నారావు మాట్లాడుతూ యూటీఎఫ్ కోనసీమ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సమకూర్చిన దుప్పట్లను వరద బాధితులకు అందజేశామన్నారు. శాంత, సత్యవతి దేవి, కుమారి, వెంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

కూనవరం: మండలంలోని కొండ్రాజుపేట, చినార్కూరు, కూనవరం తదితర పంచాయతీలలో వరద బాధితులకు కందిపప్పు, న్యూనెప్యాకెట్లు బంగాళాదుంపలు, ఉల్లిపాయలు తదితర నిత్యావసర సరకులను ఎంపీపీ పాయం రంగమ్మ, చినార్కూరు సర్పంచ్ సున్నం అభిరామ్‌లు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ కుటుంబానికి నిత్యావసర సరకులు అందజేయాలని కోరారు. వీఆర్‌ఓ ధర్మరాజు, ముత్తయ్య, మోహన్‌రావు, రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీలేరు: గుమ్మిరేవుల పంచాయతీలో వరద బాధితులకు సీలేరు పోలీసులు శనివారం వెళ్లి పరామర్శించారు. మాదిగమల్లు గ్రామంలో గిరిజనులకు నిత్యావసర సరకులను ఎస్ఐ రామకృష్ణ అందజేశారు. మాదిగమల్లు వంతెనపై తాత్కాలిక వంతెన నిర్మించి అత్యవసర రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఏ ఇబ్బంలు వచ్చినా పోలీసులను ఆశ్రయించాలని కోరారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



పైడిపుట్టలో మాట్లాడుతున్న ఎంపీడీవో బాపన్నదొర

వై.రామవరం: మండలంలోని పైడిపుట్ట గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లాల పద్మావతి, ఎంపీటీసీ సభ్యురాలు వీరమళ్ళ సుబ్బలక్ష్మి, ఎంపీడీవో బాపన్నదొర ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో బాపన్నదొర మాట్లాడుతూ పౌష్టికాహారంతోనే గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న పౌష్టికాహారాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వాటివలన కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి భార్గవచరన్, అంగన్‌వాడీ, వెలుగు సిబ్బంది, మండల మహిళా సమైఖ్య సభ్యులు, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి కృషి



ప్రిన్సిపాల్ డాక్టర్ విజయభారతిని సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

చింతపల్లి: చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మరిన్ని కొత్త కోర్సుల ఏర్పాటుతో పాటు విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలనూ కల్పించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయభారతి అన్నారు. కళాశాల అభివృద్ధికి అదనంగా నిధులు రప్పించడంతో పాటు, వివిధ కోర్సులను మంజూరు చేయడంలో విశేషంగా కృషి చేసిన ప్రిన్సిపాల్ డాక్టర్ విజయభారతిని శనివారం పలు ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు ఘనంగా సత్కరించారు. ఆయా సంఘాల నాయకులు వెంకటగిరి, మోహన్, వెంకటరమణ, గంగరాజు, రామరాజు, జగత్‌రాయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శరైతు మృతికి సంతాపం



చంద్రరావు(ఫైల్)

రాజవొమ్మంగి: మండలంలోని అప్పలరాజుపేటలో ఆదర్శ రైతుగా పేరు గాంచిన రిటైర్డ్ రైల్వే ఉద్యోగి కేదారి చంద్రరావు (66) శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. ఆయన స్నానం చేసేందుకు వెళ్ళిన చంద్రరావు ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. వెంటనే రాజవొమ్మంగి పీహెచ్‌సీకు తలించగా, అప్పటికే ఆయన మృతిచెందినట్టు వైద్యులు చెప్పారన్నారు. చంద్రరావు రైల్వేలో ఏళుగా పనిచేశారు. పదవీ విరమణ పొంది స్వగ్రామం అప్పలరాజుపేట వచ్చి వ్యవసాయం చేస్తూ ఆదర్శ రైతుగా పేరుపొందారు.

మృతుడు కామరాజు కుటుంబానికి పాడేరు ఎమ్మెల్యే పరామర్శ




సలమరంగిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కామరాజు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

జి.మాడుగుల: మండలంలో భీరం పంచాయతీ సలమరంగి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు(గృహసారధి)కాతారి కామరాజు ఇటీవల మృతి చెందారు. మృతుడు కుటుంబాన్ని శనివారం పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు పరామర్శించారు. గృహ సారిధిగా వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి ఎంతగానో కృషి చేసిన వ్యక్తి మన మధ్య లేకపోవటం విచారకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కామరాజు కుటుంబానికి పార్టీ అన్ని రకాలు సహాయ, సహకారాలను అందిస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. వైస్ ఎంపీపీ కె.సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మత్స్యకొండంనాయుడు, ఎంపీటీసీలు అచ్చిబాబు, చిట్టిబాబు, సర్పంచ్‌లు కిముడు రాంబాబు, హనుమంతరావు, గంగరాజు, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు రామకృష్ణ, అంద్రయ్య, మాజీ సర్పంచ్‌లు సీతారాంనాయుడు, కృష్ణమూర్తి, నాయకులు సోమలింగం, లక్ష్మీనాయుడు, కొండబాబు, వి రమణ, టి రాంబాబు, మత్స్యకొండబాబు, ఎం శ్రీనుబాబు చిన్నబాబు ఆచారి,కె కొండబాబు, సోమన్న తదితరులున్నారు.

పంట నష్టంపై సర్వే ప్రారంభం



కూనవరంలో వరిచేను పరిశీలిస్తున్న ఏవో శ్రీలక్ష్మి



సీలేరులో వాగు దాటుతూ సర్వేకు వెళ్తున్న మండల అధికారులు

కూనవరం: ఇటీవల సంభవించిన గోదావరి వరదలకు దెబ్బతిన్న పంటలను సర్వే చేస్తున్నట్టు మండల వ్యవసాయ అధికారి శ్రీలక్ష్మి తెలిపారు. పంద్రాజుపల్లి, వెంకన్నగూడెం పరిసర ప్రాంతాల్లో నీటమునిగిన వరిచేలను పరిశీలించారు. పంట నష్టానికి సంబంధించిన అంచనాలను సిద్ధం చేసి ఉన్నతాధికారులు నివేదిస్తామన్నారు. వీఆర్‌ఓ, వ్యవసాయశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో ఈ సర్వే జరుతుందన్నారు.

సీలేరు: మండలంలో ధారకొండ, గుమ్మిరేవుల పంచాయతీల్లో ఎంపీడీవో ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో పంట నష్టంపై సర్వే నిర్వహించారు. తొలిరోజు 200 ఎకరాల్లో పంటనష్టం, కొట్టుకుపోయిన వంతెనలు. కూలిన ఇళ్లు వంటివి గుర్తించారు. ఈవోపీఆర్డీ పాపారావు మండల వ్యవసాయ అధికారి మధుసూధనరావు, సెక్రటరీలు శ్రీనివాస్, వెంకటరావు, సర్పంచ్‌లు రాజు, కమలమ్మ, కుమారి, ఎంపీటీసీ సభ్యుడు రామన్న తదితరులున్నారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం



లోతేరులో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న హెచ్ఎం నారాయణరావు, సిబ్బంది



ముంచంగిపుట్టులో ఉపాధ్యాయుడు లవకుశను సన్మానిస్తున్న హెచ్ఎం మణిక్యాలరావు



జడ్డంగి పాఠశాలలో చిత్రలేఖనంలో పాల్గొన్న చిన్నారులు

అరకులోయ టౌన్: జిల్లా వ్యాప్తంగా హిందీ బాషా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా లోతేరు గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలలో హెచ్ఎం శెట్టి నారాయణరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ భాషగా గుర్తింపు పొందిన హిందీపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి విద్యార్థి చదువుపై దృష్టి సారించి ఉన్నతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యతోనే అన్ని రంగాల్లో రాణించగలమన్నారు. ఉపాధ్యాయులు జగ్గారావు, రాజేంద్ర, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల-1లో హిందీ భాషా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు.హిందీ ఉపాధ్యాయుడు లవకుశకు శాలువ కప్పి సత్కరించారు. మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా హెచ్ఎం మాణిక్యాలరావు మాట్లాడుతూ భారత జాతీయోధ్యమంలో ప్రజలందరిని ఏకతాటిపై నడిపేందుకు హిందీ భాష సహాయపడిందన్నారు. సెప్టెంబర్ 14న రాజ్యాంగంలోని హిందీని జాతీయ భాషగా గుర్తించారన్నారు. ప్రపంచంలో ఎక్కువగా మాట్లాడే భాషల్లో హిందీ భాష రెండవ స్థానంలో ఉందన్నారు.ఉపాధ్యాయులు మధుసూదనరావు, గిరీష్, చంద్రశేఖర్, ధనుర్జయ్ తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన హిందీ దివస్ కార్యక్రమంలో విద్యార్థులు తమ ప్రతిభ కనపరచారు.

ఈ సందర్భంగా విద్యార్థులుకు వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం రాజు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతు హిందీ దివస్‌గా పిలుచుకొనే హిందీ భాషా దినోత్సవం మన సాంస్కృతిక వారసత్వాన్ని మరింత ప్రతిబింబిస్తుందన్నారు. హిందీ ప్రాముఖ్యతను మరింత పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న అనేక కార్యక్రమాల్లో హిందీ దివస్ ఒకటి అన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం



నిమజ్జనం వేడుకలో గ్రామస్తులు, సీఆర్పీఎఫ్ పోలీసులు

సీలేరు: వినాయక ఉత్సవాల్లో భాగంగా నిమజ్జన కార్యక్రమం సీలేరులో శనివారం ఘనంగా జరిగింది. సీఆర్‌పీఎఫ్ జి-42 బెటాలియన్ ఆధ్వర్యంలో పోలీసులు కుమ్మరివీధిలో ఏర్పాటుచేసిన వినాయకుడిని పుర వీధుల్లో ఊరేగించి సమీప గెడ్డలో నిమజ్జనం చేశారు. స్థానిక 8 వ క్రాస్‌రోడ్డులో వినాయక మండపం వద్ద మధ్యాహ్నం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి

కొయ్యూరు: మండలంలోని డౌనూరు గ్రామంలోని యువతకు నేను సైతం చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకుడు శివప్రసాద్ శనివారం వాలీబాల్ కిట్‌ను డైరెక్టర్ సురేష్ ద్వారా పంపిణీ చేశారు. శివప్రసాద్ ఆదేశాల మేరకు కిట్‌ను యువతకు అందజేసినట్టు సురేష్ పట్నాయక్ తెలిపారు. యువత అన్ని రంగాల్లో రాణించాలని కోరారు.

బకాయి వేతనాలు చెల్లించాలని వినతి

అరకులోయ రూరల్: మండలంలో 14 గ్రామ పంచాయతీల పరిధిలో వివిద పాఠశాలలో పనిచేస్తున్న మాతృ భాషా ఉపాధ్యాయుల బకాయి పడ్డ మూడు నెలల వేతనాలు చెల్లించాలని కోరుతూ శనివారం ఎంఈవో కేంద్రం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఎంఈవో కార్యాలయం సిబ్బందికి వినతిపత్రాన్ని అందజేశారు. మాతృభాష ఉపాధ్యాయుల సంఘం మండల అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతు బకాయి వేతనాలు చెల్లించి, ఇకపై సక్రమంగా ప్రతి నెల జీతాలు అందేలా చూడాలని కోరారు. నాగేంద్ర, పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ల నిరసన

గంగవరం: వేతన బకాయిలను అందించి తమ శ్రమదోపిడీ జరగకుండా తగిన న్యాయం చేయాలని గెస్ట్ లెక్చరర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు స్థానిక జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్లు స్థానిక ప్రిన్సిపాల్ కళింకోట కృష్ణకు వినతిపత్రాన్ని శనివారం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గెస్ట్ లెక్చరర్లు యూనియన్ పిలుపు మేరకు గంగవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీ వినతిపత్రాన్ని ప్రిన్సిపాల్‌కు అందించారు. గెస్ట్ లెక్చలెర్లు నఫీజా, చంద్రశేఖర్ తదితరులున్నారు.

శ్రమదానంతో గోతుల పూడ్చివేత



చేదుపుట్టు కాజ్‌వే వద్ద ఏర్పడిన గొయ్యిని పూడుస్తున్న కిముడుపల్లి గ్రామస్తులు

పెదబయలు: మండలంలోని కిముడుపల్లి పంచాయతీ చేదుపుట్టు గ్రామ సమీపంలోని గేదెగెడ్డ కాజ్‌వే సమీపంలో వరద ఉధృతికి గోతులు ఏర్పడ్డాయి. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ముఖ్యంగా ఆటోలు, ద్విచక్ర వాహనాలు వెళ్లడానికి ఇబ్బందిగా మారింది. ఏ మాత్రం ఆరమరిచి వెళ్లినా ప్రమాదాలు జరుగుతాయని గుర్తించి కిముడుపల్లి గ్రామస్తులు శ్రమదానంతో శనివారం బండరాళ్లు, ఇసుక, మట్టితో గోతులను పూడ్చారు. ఈ మార్గం మీదుగా సుమారు ఆరు పంచాయతీల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని, ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని, ఇందుకోసం గోతులనూ పూడ్చినట్టు చెప్పారు. గ్రామస్తులు లక్ష్మీనాయుడు, సత్యనారాయణ, కొండబాబు, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.